## విలేకరులు కావలెను

హిందుస్థాన్ మీడియా తెలుగు దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ రాష్ట్రాలలో జిల్లా రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జులు, మండలాలవారిగా విలేకరులు కావలెను. అనుభవం కలవారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

సంప్రదించండి
9000306455



hindustanmedia333@gmail.com APTEL / 2004 / 19136

# హిందుస్థాన్ మీడియా

తెలుగు దిన పత్రిక

సామాన్యుడి నేస్తం








ఎడిటర్ : తాడెం. ప్రశాంత్ సిద్దిపేట సంపుటి : 1 సంచిక : 47 సోమవారం జూన్ 15 2026, పేజీలు - 4 వెల :2/-


## నేటి నుంచి పాఠశాలలు ప్రారంభం

-నేటినుంచి విద్యార్థుల కోసం కొత్త పథకం.. పుస్తకాలు,రాగిజావ పంపిణీ ప్రారంభం



హిందుస్థాన్ మీడియా

సుదీర్ఘ వేసవి విరామానికి తెరపడింది. సరికొత్త ఆశలు, ఆశయాలతో తెలంగాణ వ్యాప్తంగా సోమవారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. దాదాపు 50 రోజుల పాటు సెలవుల మజాను ఆస్వాదించిన విద్యార్థులు..మళ్లీ పుస్తకాల సంచులు సర్దుకుని క్లాస్‌రూమ్‌ల వైపు అడుగులు వేయనున్నారు. విద్యార్థుల రాకతో ఇన్నాళ్లూ నిశ్శబ్దంగా ఉన్న స్కూల్ ఆవరణలన్నీ మళ్లీ పిల్లల సందడితో కోలాహలంగా మారనున్నాయి. కొత్త విద్యా సంవత్సరానికి ఘనంగా స్వాగతం పలికేందుకు ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాలు ఇప్పటికే తరగతి గదులను శుభ్రం చేయించి సర్వం సిద్ధం చేశాయి.లక్ష మందికి పైగా టీచర్లు విధుల్లోకి.రాష్ట్రంలో దాదాపు 26,000 కు పైగా ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలలతో పాటు వేలాది ప్రైవేట్ విద్యాసంస్థలు సోమవారం నుంచి ఒకేసారి తెరుచుకోనున్నాయి.ఈ స్కూళ్లలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు సుమారు 1.10 లక్షల మందికి పైగా ఉపాధ్యాయులు, విద్యా సిబ్బంది తమ విధులకు హాజరు కానున్నారు. నిజానికి జూన్ 12నే స్కూళ్లు తెరుచుకోవాల్సి ఉన్నప్పటికీ, ఎండల తీవ్రత దృష్ట్యా అధికారులు జూన్ 15కి వాయిదా వేశారు. ఈ మూడు రోజుల పనిదినాల నష్టాన్ని భర్తీ చేసేందుకు జూలై 11న వచ్చే రెండో శనివారం నాడు పాఠశాలలను యథావిధిగా నడపాలని విద్యాశాఖ నిర్ణయించింది.కొత్త అకడమిక్ క్యాలెండర్ పాఠశాల విద్యాశాఖ రూపొందించిన నూతన అకడమిక్ క్యాలెండర్ ప్రకారం ఈ ఏడాది మొత్తం 227 పనిదినాలు ఉంటాయి. దీని ప్రకారం జూలై 31 లోపు ఫార్మేటివ్ అసెస్‌మెంట్, సెప్టెంబర్ 21 నాటికి FA-2, అక్టోబర్ 1 నుంచి 9 వరకు సమ్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షలు నిర్వహిస్తారు. ఇక పండుగ సెలవుల విషయానికి వస్తే, అక్టోబర్ 10 నుండి 22 వరకు దసరా సెలవులు, డిసెంబర్ 23 నుండి 27 వరకు క్రిస్మస్ సెలవులు (మిషనరీ స్కూళ్లకు), అలాగే 2027 జనవరి 13 నుండి 17 వరకు సంక్రాంతి సెలవులు ఉంటాయి. ఈ పూర్తి విద్యా సంవత్సరం 2027 ఏప్రిల్ 23తో ముగుస్తుంది, ఆ మరుసటి రోజు నుంచే విద్యార్థులకు మళ్లీ వేసవి సెలవులు ప్రారంభమవుతాయి. మొదటి రోజే పుస్తకాలు, రాగిజావ పంపిణీ ప్రభుత్వ స్కూళ్లలో చదివే పేద విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా స్కూల్ తెరిచిన మొదటి రోజే ఉచితంగా పాఠ్యపుస్తకాలు,యూనిఫామ్‌ల పంపిణీ పూర్తి చేయాలని విద్యాశాఖ ఆదేశించింది. దీనితో పాటు విద్యార్థుల ఆరోగ్యం మెరుగుపరచడం, బడికి వచ్చేలా ప్రోత్సహించే లక్ష్యంతో 'సీఎం బ్రేక్‌ఫాస్ట్' పథకాన్ని, రాగిజావ పంపిణీని కూడా ఈసారి పకడ్బందీగా అమలు చేయనున్నారు. కొత్త క్లాసులు, సరికొత్త పాఠాలతో ప్రారంభం కానున్న ఈ విద్యా ప్రయాణం కోసం అటు విద్యార్థులు, ఇటు ఉపాధ్యాయులు ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు.

# వర్షాల పైన అప్రమత్తంగా ఉండాలి

-అలసత్వం ప్రదర్శించే అధికారులపైన కఠిన చర్యలు
-కోర్ అర్బన్ రీజియన్ లో మరింత అప్రమత్తంగా ఉండాలి
-వర్షం కారణంగా ట్రాఫిక్ జాం అయితే సహించను
-వర్షాల సమయంలో అధికారులు, పోలీసులు రోడ్ల పై ఉండాల్సిందే
-అవసరమైతే నేనూ రోడ్ మీదికి వస్తా..
-సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు

హిందుస్థాన్ మీడియా

వర్షాల సమయంలో అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆయన తేల్చిచెప్పారు. అలసత్వంగా వ్యవహరించే అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వర్షాకాల సన్నద్ధతపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలోని బోధి పేవిలియన్‌లో ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ సీవీ ఆనంద్‌తో పాటు ఇరిగేషన్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, వైద్య ఆరోగ్య శాఖ, పోలీసు శాఖ, వ్యవసాయ శాఖ, వాతావరణ శాఖల ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొన్నారు. జూన్ 9న కోర్ అర్బన్ రీజియన్‌లో వర్షం కారణంగా ఏర్పడిన పరిస్థితులపై ముఖ్యమంత్రి ఆరా తీశారు. సైబరాబాద్‌తో పాటు అనేక ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ కావడంతో నగరవాసులు ఇబ్బందులు పడటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసినప్పటికీ మున్సిపల్, పోలీసు, ట్రాఫిక్ సిబ్బంది అప్రమత్తం కాలేదన్నారు . వర్షాల సన్నద్ధతపై జూన్ 1న సమీక్ష నిర్వహించి తాను స్వయంగా అనేక సూచనలు చేశానని గుర్తుచేశారు. అయినప్పటికీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని ముఖ్యమంత్రి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. జూన్



9న వర్షం సమయంలో మున్సిపల్, పోలీసు అధికారుల మధ్య సమన్వయం లోపించిందన్నారు. ఈ పరిస్థితికి గల కారణాలను విశ్లేషించి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ సీవీ ఆనంద్‌లను ఆదేశించారు. మరో సారి ఇలాంటి పరిస్థితి వస్తే కఠిన చర్యలు తీసుకుంటానని అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. వాతావరణ శాఖ సూచనల మేరకు వర్షాలపై ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. వర్షం సమయంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, హైడ్రా, ట్రాఫిక్, జలమండలి సిబ్బందితో పాటు సివిల్ పోలీసులు కూడా క్షేత్రస్థాయిలో ఉండాల్సిందేనన్నారు. పోలీసు కమిషనర్ నుంచి కింది స్థాయి సిబ్బంది వరకు రోడ్లపైకి రావాల్సిందేనని తేల్చిచెప్పారు. అవసరమైతే తాను కూడా రోడ్డుపైకి వస్తానని ముఖ్యమంత్రి అన్నారు. వర్షం కారణంగా ట్రాఫిక్ జామ్ అయితే ఇకపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ట్రాఫిక్ విభాగంలోని ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలని డీజీపీకి సూచించారు. మానవ తప్పిదాల వల్ల సమస్యలు తలెత్తితే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించనని హెచ్చరించారు. వర్షాల సమయంలో ఏర్పడే వాటర్ లాగింగ్ పాయింట్లు, బ్లాక్ స్పాట్లు, ట్రాఫిక్ జామ్ అయ్యే ప్రాంతాల డేటా ఆధారంగా అధికారులు సన్నద్ధం కావాలని సూచించారు. వర్షం కారణంగా పలు చోట్ల చెట్లు కూలిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడటంపై ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ పునరుద్ధరణ వెంటనే జరగాలని సూచించారు. అవసరమైన చోట్ల మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలన్నారు. వర్షం సమయంలో విద్యుత్ శాఖ సిబ్బంది అంతా క్షేత్రస్థాయిలో పనిచేసేలా చూడాలని ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టుల వద్ద పటిష్ట చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇరిగేషన్ అధికారులకు సూచించారు. మాన్యువల్ ప్రకారం ప్రాజెక్టుల నిర్వహణ ఉండాలన్నారు. వర్షాకాలంలో ప్రాజెక్టుల వద్ద సంబంధిత ఇంజినీర్లు తప్పనిసరిగా స్థానికంగా ఉండాలని పేర్కొన్నారు. ఉన్నతాధికారుల అనుమతి లేకుండా ప్రాజెక్టులను వదిలి వెళ్లే ఇంజినీర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని నీటిపారుదల శాఖ కార్యదర్శిని ఆదేశించారు.ప్రాజెక్టుల గేట్ల మరమ్మతులు, నిర్వహణకు అవసరమైన నిధులను వెంటనే మంజూరు చేయాలని ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియాకు సూచించారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో వ్యవసాయ శాఖ అధికారులు పూర్తి స్థాయిలో సన్నద్ధం కావాలని ముఖ్యమంత్రి సూచించారు. ముఖ్యంగా విత్తనాలు, యూరియా పంపిణీపై దృష్టి సారించాలన్నారు. రైతు వేదికల ద్వారా యూరియా పంపిణీ చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. యూరియా స్టాక్ , పంపణి కోసం స్థానిక వ్యవసాయ అధికారిని బాధ్యుడిగా నియమించడంతో పాటు రెవెన్యూ సిబ్బందిని కూడా భాగస్వామ్యం చేయాలన్నారు. సన్న వడ్ల కోసం వ్యవసాయ శాఖ ప్రకటించిన ఎనిమిది రకాల విత్తనాలపై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. వర్షాల కారణంగా తాగునీరు కలుషితం కాకుండా చూడాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. గతంలో తాగునీటి కాలుషితం కారణంగా జరిగిన ఘటనలను దృష్టిలో ఉంచుకుని ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు నీటి పరీక్షలు నిర్వహించాలని జలమండలి అధికారులను ఆదేశించారు.నీటి కలుషితం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున వైద్య ఆరోగ్య శాఖ పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. సీజనల్ వ్యాధులను దృష్టిలో ఉంచుకుని అవసరమైన మందులను సిద్ధం చేసుకోవాలన్నారు. వర్షాల కారణంగా నీటి నిల్వలు ఏర్పడి అపరిశుభ్ర వాతావరణం ఏర్పడే అవకాశం ఉన్నందున శానిటేషన్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, జలమండలి, వైద్య ఆరోగ్య శాఖలతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్‌కు ముఖ్యమంత్రి సూచించారు. పోలీసు, ట్రాఫిక్, ఫైర్, హైడ్రా, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సంస్థలతో సమన్వయం చేసుకుంటూ ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించాలని డీజీపీ సీవీ ఆనంద్‌ను ఆదేశించారు.

## పదవ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం 2001-2002 బ్యాచ్

హిందుస్థాన్ మీడియా

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల , కామంచికల్‌లో 2001-2002 పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించబడింది. దాదాపు 24 సంవత్సరాల అనంతరం ఒకే వేదికపై కలుసుకున్న పూర్వ విద్యార్థులు తమ పాఠశాల రోజుల మధుర జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఆనందోత్సాహాలతో కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ సందర్భంగా పాఠశాలలో సేవలందించిన ఉపాధ్యాయులు కె. వెంకటేశ్వర్లు, జి. రామమూర్తి , ఎం. అనంతరాములు , ఎం.డి. ఉమర్ , టి. వీరయ్య , ఎం.డి. షమీమ్ తలత్ , టి. బుచ్చిబాబు , పి. ప్రసూన , ఎం. రోహిణి , వై. ప్రేమలత , ఎ. రమాదేవి లను పూలతో ఆహ్వానించి, పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాలు కప్పి, మెమెంటోలు అందించి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ముందుగా విద్యార్థుల ముఖాముఖి పరిచయ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఉపాధ్యాయులు మాట్లాడుతూ తమ వద్ద చదువుకున్న విద్యార్థులు నేడు వివిధ రంగాలలో ఉన్నత స్థానాల్లో ఉండటం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ముఖ్యంగా 2001-2002 బ్యాచ్ నుండి పలువురు ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలలో ఉన్నత స్థాయికి చేరుకోవడం గర్వకారణమని తెలిపారు. ఈ సందర్భంగా బ్యాచ్‌కు చెందిన బొడా రమేష్ ప్రస్తుతం వరంగల్‌లో ఐటీ సీఐగా విధులు నిర్వహిస్తున్నారని,



అలాగే యాట, రంగారావు, మలోత్ రమేష్, భూక్య ఉపేందర్ పోలీసు శాఖలో,మేకల సైదులు ఆర్మీ డిపార్ట్మెంట్ లో,భూక్యా వీరన్న ఢిల్లీలో సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా రాగి సత్యనారాయణ, అంబేద్కర్, పుల్లారావు, కొప్పెర సత్యనారాయణ, నామాల నాగరాజు, షేక్ జానీ, అంతోటి వెంకటేష్ తదితరులు ప్రైవేట్ రంగంలో ఉన్నత స్థాయికి ఎదిగి బ్యాచ్‌కు మంచి గుర్తింపు తీసుకువచ్చారని, మగవారికేమి తాక్కువ ఎమ్ కావంటూ, ఆడపిల్లలు స్వంత వ్యాపారంలో ఎదిగిన వారిలో కల్యాణి,పద్మజ, జ్యోతి, విప్రోలో సుజాత, కొందరు వ్యవసాయ రంగంలో ఎదిగిన వారు కూడా ఉన్నారని కొనియాడారు. ఈ కార్యక్రమాన్ని పూర్తిగా 2001-2002 బ్యాచ్ విద్యార్థులు,విద్యార్థినులే స్వచ్ఛందంగా విరాళాలు సమకూర్చుకొని నిర్వహించడం విశేషం. వివిధ జిల్లాల నుండి వచ్చిన పూర్వ విద్యార్థినులు కూడా కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారు. మధ్యాహ్న భోజనానంతరం ఉపాధ్యాయుల సన్మానం, మాటామంతీ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం టీ బ్రేక్ తర్వాత అందరూ కలిసి గ్రూప్ ఫోటోలు దిగారు. పాఠశాల రోజుల సరదా జ్ఞాపకాల ను గుర్తుచేసుకుంటూ ఉపాధ్యాయులతో కలిసి ఆనందంగా గడిపారు. తదనంతరం వినోద కార్యక్రమాలు నిర్వహించి సాయంత్రం కార్యక్రమాన్ని ముగించారు. ఈ ఆత్మీయ సమ్మేళనం పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయుల మధ్య ఉన్న అనుబంధాన్ని మరింత బలోపేతం చేస్తూ అందరి హృదయాలలో చిరస్మరణీయ జ్ఞాపకంగా నిలిచింది.



## నన్ను టచ్ చేసే వ్యక్తి ఇంకా పుట్టలేదు

సీఎం రేవంత్‌పై రెచ్చిపోయిన కిషన్ రెడ్డి

హిందుస్థాన్ మీడియా

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని, తెలంగాణ బిడ్డలకు కాంగ్రెస్ పార్టీ వెన్నుపోటు పొడిచిందని ధ్వజమెత్తారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ. సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్ మెట్రోరైల్ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వలేదని కాంగ్రెస్ చేస్తున్న విమర్శలను కిషన్ రెడ్డి కొట్టిపారేశారు. మెట్రోరైలు కేంద్ర ప్రభుత్వమే నిధులు కేటాయించిందని స్పష్టం చేశారు. "మెట్రో ప్రాజెక్టుకు కేంద్రం డబ్బులు ఇవ్వలేదని నిరూపిస్తే మేం రాజీనామా చేయడానికి సిద్ధం. మరి ఎన్నికల హామీలను అమలు చేయని మీరు రాజీనామా చేస్తారా?" అంటూ రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డిలకు సవాల్ విసిరారు. ఎవరు రాజీనామాకు సిద్ధమో తేల్చుకోవాలన్నారు.

# ఇసుక మాఫియాపై పోలీసుల ఉక్కుపాదం

**-అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణా చేస్తూ పట్టుబడ్డ ముగ్గురు**
**-ట్రాక్టర్ సీజ్.. ఇద్దరు పరారీలో**
**-మద్దూరు ఎస్ఐ ఎం.డి. ఆసిఫ్ ఆధ్వర్యంలో మెరుపు దాడులు**

మద్దూరు/ధూళిమిట్ట, జూన్ 14 (హిందుస్థాన్ మీడియా):

ధూళిమిట్ట మండలంలోని జాలపల్లి గ్రామ శివారులో ఉన్న మోయే తుమ్మెద వాగులో అక్రమంగా ఇసుక తవ్వకాలు, రవాణా చేస్తున్న ముగ్గురు వ్యక్తులపై మద్దూరు పోలీసులు కేసు నమోదు చేశారు. ఇసుక అక్రమ రవాణాకు వినియోగిస్తున్న ఓ ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు మద్దూరు ఎస్ఐ ఎం.డి. ఆసిఫ్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. వాగులో అక్రమంగా ఇసుక తవ్వకం, రవాణా జరుగుతున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు ఆదివారం ఉదయం 7 గంటల సమయంలో బ్లూకోల్ట్స్ సిబ్బందితో కలిసి ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఒక ట్రాక్టర్‌లో ఇసుక లోడ్ చేసి సిద్ధంగా ఉంచగా, మరో ట్రాక్టర్‌లో జేసీబీ సహాయంతో ఇసుకను లోడ్ చేస్తున్నట్లు గుర్తించారు. పోలీసులను గమనించిన వెంటనే బందారం పరశురాములు ఇసుక లోడ్ చేసిన ట్రాక్టర్‌తో, జక్కు నరేష్ తన జేసీబీతో అక్కడి నుంచి పరారయ్యారు. మరో ట్రాక్టర్‌లో ఉన్న ఇసుకను అక్కడే దింపి తప్పించుకునేందుకు ప్రయత్నించిన డ్రైవర్‌ను పోలీసులు సకాలంలో అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన వ్యక్తిని జాలపల్లి గ్రామానికి చెందిన లిగడ్డం సంజీవ రెడ్డి (38)గా గుర్తించారు. అతడి వద్ద ఉన్న లిలిపవర్‌ట్రాక్ ట్రాక్టర్



(టూ25+6437)లిను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. గడ్డం సంజీవ రెడ్డి, బందారం పరశురాములు, జక్కు నరేష్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్ఐ ఎం.డి. ఆసిఫ్ తెలిపారు. పరారీలో ఉన్న నిందితులను త్వరలోనే అరెస్ట్ చేస్తామని పేర్కొన్నారు. ఈ దాడుల్లో హెడ్ కానిస్టేబుల్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# వానలు కురవాలి.. పంటలు పండాలి

**-గ్రామ దేవతలకు జలాభిషేకం చేసిన మద్దూరు గ్రామస్తులు**
**-సర్పంచ్ దామెర మల్లేశం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు**

మద్దూరు, జూన్ 14 (హిందుస్థాన్ మీడియా):

వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని ఆకాంక్షిస్తూ మద్దూరు మండల కేంద్రంలో గ్రామస్తులు ఆదివారం గ్రామ దేవతలకు జలాభిషేకం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ దామెర మల్లేశం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహిళలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పానుగంటి తిరుపతయ్య గ్రామ దేవతలకు వేద మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులు, మహిళలు, రైతులు కలిసి గ్రామ దేవతలకు జలాభిషేకం చేసి మంచి వర్షాలు కురిసి రైతాంగం సుభిక్షంగా ఉండాలని ప్రార్థించారు. గ్రామ సర్పంచ్ దామెర మల్లేశం ప్రత్యేక పూజలు నిర్వహించి కొబ్బరికాయ కొట్టి కార్యక్రమాన్ని ప్రారంభించారు. రైతుల సంక్షేమం, గ్రామాభివృద్ధి కోసం గ్రామ దేవతల ఆశీస్సులు ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యురాలు రేష్మ గౌరీ, మాజీ



ఎంపీటీసీ సభ్యులు బూరుగు నర్సింహులు గౌడ్, శనిగారం అంజయ్య, బూరుగు రాజు, ఇరుమల్ల మల్లేశం, చిలుక దశరథ, అర్చకులు పానుగంటి తిరుపతయ్య, గ్రామ పంచాయతీ సిబ్బంది, మహిళలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# 12 ఏళ్ల కాలంలో ప్రధాని “మోడీ” సాధించిన విజయాలను ప్రచారం చేయాలి

**-ఉజ్వల, సడక్, ఆయుష్మాన్ భారత్ వంటి పథకాలేన్నో ప్రవేశం..**
**-రాష్ట్రంలో బిజెపి జెండా ఎగిరేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి ..**
**-విలేకరుల సమావేశంలో ఉదయ్ ప్రతాప్, బైరెడ్డి**

జూన్ 14 (హిందుస్థాన్ మీడియా)

లక్ష్మీదేవిపల్లి : 12 ఏళ్ల కాలంలో భారత ప్రధాని నరేంద్ర మోడీ సాధించిన విజయాలు దేశాన్ని ఏ విధంగా ముందుకు తీసుకెళ్లారు అనే అంశాలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని భారతీయ జనతా పార్టీ నల్గొండ జిల్లా ఇన్చార్జి ఉదయ్ ప్రతాప్ పిలుపునిచ్చారు. ఆదివారం భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేయుచున్న విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర పార్టీ అధికార ప్రతినిధి రామలింగేశ్వర రావు సమక్షంలో జిల్లా పార్టీ అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి సమక్షంలో ఆయన మాట్లాడారు. 12ఏళ్ల కాలంలో భారత ప్రధాని నరేంద్ర మోడీ సాధించినటువంటి విజయాలు, దేశాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకు వెళ్లాయన్నారు. కేంద్ర ప్రభుత్వం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అనేక ప్రజా ప్రయోజన కార్యక్రమాలను, సంక్షేమ పథకాలను అమలు చేయడం జరుగుతుందన్నారు. రాబోయే రోజులలో తెలంగాణ రాష్ట్రంలో, అలాగే జిల్లాలో అధికారమే లక్ష్యంగా బిజెపి శ్రేణులు పని చేస్తామని పేర్కొన్నారు. అయితే భద్రాచలం రోడ్, సత్తుపల్లి రైల్వే లైన్ పని పూర్తి చేసిన ఘనత కేంద్రంలో ఉన్నటువంటి భారతీయ జనతా పార్టీ ప్రభుత్వానిదేమన్నారు. అన్నారు. అంతేగాక ఉజ్వల యోజన, ప్రధానమంత్రి సడక్ యోజన, ఆయుష్మాన్ భారత్, గరీబ్ కళ్యాణ్ యోజన, మేకిన్ ఇండియా, డిజిటల్ ఇండియా స్టాండప్ ఇండియా తదితర పథకాలను ప్రవేశపెట్టిన ఘనత కూడా ప్రధానమంత్రి మోడీదేనని వివరించడం జరిగింది. మరి ముఖ్యంగా ఈ యొక్క తెలంగాణ రాష్ట్రంలో ఆయుష్మాన్ భారత్ అనే ఒక పథకాన్ని అమలు పరచడంలో తెలంగాణ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచల శ్రీ రాముడి దేవాలయ అభివృద్ధికి రు.98 కోట్ల ఖర్చు చేసిన ఘనత కేంద్రంలో బిజెపి ప్రభుత్వానిదేనన్నారు. అంతేగాక మోడీ చొరవే నని తెలిపారు. పదేళ్లపాటు అధికారంలో ఉన్న బి ఆర్ ఎస్ ప్రభుత్వానికి గానీ ఇప్పుడు అధికారంలో ఉన్నటువంటి కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని వ్యాఖ్యానించారు. భద్రాచల శ్రీ రాముని ఆలయ అభివృద్ధిని పట్టించుకున్న పాపాన లేదని విమర్శించారు. ముఖ్యంగా పారిశ్రామిక ప్రాంత మైనటువంటి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకి కేంద్ర ప్రభుత్వం గత పాలకుల కంటే కూడా ఎంతో ప్రోత్సహి స్తుందని తెలియజేశారు. ఇదే ఉమ్మడి జిల్లాకు సంబంధించి ముగ్గురు మంత్రులు ఉన్నా కూడా జిల్లాకి ఎలాంటి అభివృద్ధి పనులు చేయకపోగా అదే పనిగా భారతీయ జనతా పార్టీని విమర్శిస్తూ పబ్బం గడుపుకుంటున్నారని విమర్శించారు. ఖమ్మం జిల్లాలో చిన్నారిపై ఒక ముస్లిం యువకుడు దారుణానికి వడిగడితే కనీసం



స్పందించడానికి మనసు రాని చేతకాని ప్రభుత్వమని విమర్శించారు. ప్రభుత్వంలో పని చేస్తున్న మంత్రులని తీవ్రస్థాయిలో విమర్శించారు కేవలం ఒక సామాజిక వర్గానికి సంబంధించిన వ్యక్తి అని మంత్రులు ఎవరు కూడాను నోరు మెదపని పరిస్థితి అని తీవ్రస్థాయిలో విమర్శించారు. రాష్ట్రంలో కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలు మాత్రమే కొనసాగుతున్నాయని వ్యాఖ్యానించారు. ప్రజల సంక్షేమాన్ని, దేశ అభివృద్ధిని, రాష్ట్ర అభివృద్ధిని గాలికి వదిలేసారని ఆరోపించారు. ముఖ్యంగా బీజేపీని విమర్శించే ప్రభుత్వాలు ఏ విధంగా అధికారానికి దూరమ య్యాయో వివరించారు. ముఖ్యంగా రాబోవు రోజులలో భారతీయ జనతా పార్టీ తెలంగాణలో అధికారంలోకి వస్తుందని ప్రగాఢ విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షురాలు చెరుకు భాగ్యలక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శి జాటోత్ వెంకన్న నాయక్, భోగి కృష్ణ, పుణ్యం బిక్షపతి, కార్యదర్శులు తుం పూరిశివ, పుణ్యా నాయక్, ఎస్ఐఆర్ కన్వీనర్ మోహనకృష్ణ,మీడియా కన్వీనర్ రామారావు, జిల్లా కార్యాలయ కార్యదర్శి దురిశెట్టి కుమార్, మహిళా నాయకురాలు సముద్రాల గాయత్రి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ లో వచ్చే ఎన్నికల్లో అధికారం లోకి కాంగ్రెస్ పార్టీ

**-డిసిసి అధ్యక్షుడు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం**

జూన్ 14 (హిందుస్థాన్ మీడియా)

ప్రత్యేక ఓటర్ల జాబితా సమగ్ర సవరణ ఎస్ఐఆర్ పై కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ బీఎల్ఏ-2”బూత్ లెవల్ ఏజెంట్-2” సభ్యుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ సానుభూతిపరులు, లౌకికవాద ఓటర్లను లక్ష్యంగా చేసుకుని కుట్రలకు పాల్పడుతోందని ఆరోపించారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో ప్రతి కాంగ్రెస్ నాయకుడు, కార్యకర్త, ప్రజాప్రతినిధి చురుకుగా పాల్గొని అర్హులైన ఓటర్ల పేర్లు జాబితాలో కొనసాగు తున్నాయో లేదో పరిశీలించాలని సూచించారు. రాబోయే ఎన్నికల్లో కరీంనగర్ అసెంబ్లీ స్థానాన్ని కాంగ్రెస్ పార్టీ గెలుచుకుంటుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం బిజెపి కుట్రలను అడ్డుకొని తీరుతామని ఓట్లు చోరీ కాకుండా ప్రతి కార్యకర్త సైనికుల వలె అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. మాస్టర్ ట్రైనర్, పీసీసీ ఉపాధ్యక్షుడు నమిండ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో పార్టీ శ్రేణులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఈ నెల 25వ తేదీ నుంచి ప్రారంభమయ్యే కార్యక్రమంలో బూత్ స్థాయి నాయకులు, ఏజెంట్లు, కార్యకర్తలు పూర్తి స్థాయిలో పాల్గొని ప్రతి ఓటును రక్షించాల్సిన బాధ్యత తీసుకోవాలన్నారు. సంబంధం లేని కేసులో మీనాక్షి నటరాజన్ నామినేషన్ను రిటర్నింగ్ అధికారి తిరస్కరించారని కేంద్ర ప్రభుత్వం ఓటు చోరీ ఏ కాకుండా సీట్ చోరీ కూడా చేస్తున్నదని మండిపడ్డారు. నిష్పక్షపాతంగా నిజాయితీగా గాంధీ యవాది పద్ధతిలో ముందుకు వెళుతున్న మీనాక్షి నటరాజ్ నామినేషన్ తిరస్కరించడం దారుణమని ఆందోళన వ్యక్తం చేశారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యంతో తీసుకోవాలని కోరారు. ఓటరు నమోదు, మార్పులు, చేర్పుల ప్రక్రియలో ప్రజలకు అవసరమైన సహాయం అందించాలని సూచించారు. ఓటర్ మ్యాపింగ్



ప్రక్రియపై పూర్తి అవగాహన పెంపొంది ంచుకోవాలని, ప్రతి ఇంటిలో ఉన్న ఓటర్ల వివరాలను సమగ్రంగా తెలుసుకుని ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం మాస్టర్ ట్రైనర్ నమ్మిండ్ల శ్రీనివాస్ బీఎల్ఏ-2 సభ్యులు, బూత్ లెవల్ ఏజెంట్లకు ప్రత్యేక ఓటరు జాబితా సవరణ “ఎస్ఐఆర్” ప్రక్రియపై సమగ్ర శిక్షణ అందించారు. ఈ కార్య క్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్పొరేటర్లు, బూత్ స్థాయి ఏజెంట్లు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బీజేపీ బలోపేతానికి ప్రతి కార్యకర్త బాధ్యతాయుతంగా పనిచేయాలి..

**-బీజేపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యులు కుంజా ధర్మా**



జూన్ 14 (హిందుస్థాన్ మీడియా)

భద్రాచలంలో బీజేపీ నియోజకవర్గకార్యాలయంలో ఆదివారం భారతీయ జనతా పార్టీ మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యులు కుంజా ధర్మా మాట్లాడుతూ, భారతీయ జనతా పార్టీ దేశంలో అత్యంత క్రమశిక్షణ కలిగిన పార్టీ అని అన్నారు. పార్టీ అభివృద్ధి, బలోపేతం కోసం ప్రతి నాయకుడు, కార్యకర్త ఒక బాధ్యతను స్వీకరించి సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలను గ్రామస్థాయికి తీసుకెళ్లి ప్రజల్లో పార్టీపై మరింత విశ్వాసం పెంచే విధంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాబోయే కార్యక్రమాలు, సభ్యత్వ విస్తరణ, బూత్ స్థాయి నిర్మాణం మరియు పార్టీ సంస్థాగత బలోపేతంపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు.

**-ఈ సందర్భంగా ప్రజా సమస్యలకు సంబంధించిన పలు అంశాలపై సమావేశంలో చర్చించి తీర్మానాలు చేశారు.**

ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో ప్రభుత్వం నిర్ణయించిన మేరకే ఫీజులు వసూలు చేయాలని, అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు మరియు ఆసరా పెన్షన్లు మంజూరు చేయాలని, ఎస్ ఐఆర్ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, భద్రాచలం పట్టణంలోని అద్వానంగా ఉన్న డ్రైనేజీలు, వీధిలైట్లు, రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని, అర్హులైన పేదలకు ఇళ్ల నిర్మాణం కోసం ఉచితంగా ఇసుక అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ప్రధాన ఎజెండాగా సమావేశంలో తీర్మానించారు. అదేవిధంగా:- ఈ సందర్భంగా ఇటీవల పార్టీలో కీలక బాధ్యతలు స్వీకరించిన బీజేపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యులు కుంజా ధర్మా, బీజేపీ రాష్ట్ర ఎస్టీ మోర్చా ప్రధాన కార్యదర్శి కుంజా సంతోష్, బీజేపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యులు ములిశెట్టి రాంమోహన్ రావులను పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ భద్రాచలం మండల ఇంచార్జ్ తాటి పాముల ఐలయ్య, మండల అధ్యక్షులు ముత్యాల శ్రీనివాస్, నాయకులు నిడదవోలు నాగబాబు, పి.సి. కేశవ్, ముత్యాల చంద్రశేఖర్, చెల్లుబోయిన వెంకన్న, ఆవుల సుబ్బారావు, అల్లాడి వెంకటేశ్వరరావు, దేవరపల్లి వెంకటేశ్వర్లు, అల్లాడి వెంకట సుబ్బారావు, శేర్ శ్రీనివాస్, గంగులకుర్తి రామాచారి, జి. వెంకటేశ్వర్లు, గార్లపాటి శ్రీనివాస్, అన్నం సాయి లక్ష్మణ్, మండల గురుసాయి, జె. ప్రభాకర్, లంకా విమల, కెల్లా అప్పారావు, సి.హెచ్. పాపయ్య, పి. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నూతన పోలీస్ స్టేషన్ల ఏర్పాటుకు స్థలాల పరిశీలన

## ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణారావు

**-పోలీస్ స్టేషన్ల నిర్మాణానికి అనువైన స్థలాలపై సమగ్ర నివేదిక సమర్పించాలని అధికారులకు ఆదేశం**



జూన్ 14 (హిందుస్థాన్ మీడియా)

జిల్లాలో నూతన పోలీస్ స్టేషన్ల ఏర్పాటు కోసం ప్రతిపాదించిన స్థలాలను ప్రభుత్వ విప్ శాసనసభ్యులు చింతకుంట విజయ రమణారావు ఆదివారం పరిశీలించారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝాతో కలిసి ఎలిగేడు మండలంలో ఏర్పాటు చేయనున్న నూతన పోలీస్ స్టేషన్‌కు ప్రతిపాదించిన స్థలాన్ని, పెద్దకల్వల లోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సమీపంలో ఏర్పాటు చేయనున్న నూతన పోలీస్ స్టేషన్ స్థలాన్ని, పెద్దపల్లి లోని వ్యవసాయ మార్కెట్ లోని మహిళా పోలీస్ స్టేషన్ సమీపంలో ఏర్పాటు చేయనున్న నూతన పోలీస్ స్టేషన్ స్థలాన్ని, పెద్దపల్లి లోని బంధంపల్లి గ్రామంలో ఏర్పాటు చేయనున్న రూరల్ పోలీస్ స్టేషన్ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణారావు మాట్లాడుతూ ప్రజలకు మరింత మెరుగైన భద్రతా సేవలు అందించేందుకు నూతన పోలీస్ స్టేషన్ల ఏర్పాటు అవసరమని తెలిపారు. పోలీస్ స్టేషన్ల నిర్మాణానికి సంబంధించి అనువైన స్థలాల ఎంపికపై సమగ్ర నివేదికను సోమవారం సాయంత్రం లోపు సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నూతన పోలీస్ స్టేషన్ల ఏర్పాటు ద్వారా ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువవుతాయని, శాంతిభద్రతల పరిరక్షణలో ఇది కీలకంగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, సుల్తానాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రకాష్ రావు, పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి బి. గంగయ్య, పోలీస్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# బిజినెస్

## టాటా ఫ్యాక్టరీకి టిఎన్‌పిసిబి షాక్

-ఐఫోన్ విడిభాగాల యూనిట్‌కు నోటీసులు





హోసూర్: ఆపిల్ ఐఫోన్ విడిభాగాలను తయారు చేసే ప్రముఖ దేశీయ సంస్థ టాటా ఎలక్ట్రానిక్స్ కు తమిళనాడు కాలుష్య నియంత్రణ బోర్డు (టిఎన్‌పిసిబి) గట్టి షాక్ ఇచ్చింది. తమిళనాడులోని హోసూర్‌లో ఉన్న ఈ ప్లాంట్ నుంచి వెలువడుతున్న వ్యర్థ జలాల వల్ల సమీపంలోని వ్యవసాయ భూములు, బావుల్లోని భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయనే ఆరోపణలపై సంస్థకు హెచ్చరిక నోటీసులు జారీ చేసింది. ఈ వ్యవహారంపై మే 25 నాటి నోటీసుకు సరైన వివరణ ఇవ్వకుంటే ఫ్యాక్టరీని మూసివేయడంతో పాటు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని స్పష్టం చేసింది. చైనాపై ఆధారపడటాన్ని తగ్గించుకునే వ్యూహంలో భాగంగా భారతదేశంలో ఆపిల్ సరఫరా గొలుసులో తైవాన్‌కు చెందిన ఫాక్స్‌కాన్ తర్వాత టాటా ఎలక్ట్రానిక్స్ రెండవ అతిపెద్ద భాగస్వామిగా ఉన్న తరుణంలో ఈ నోటీసులు రావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఫ్యాక్టరీ నుంచి వస్తున్న రసాయన వ్యర్థ జలాల వల్ల తమ పంట పొలాలు, బావులు కలుషితం అవుతున్నా యంటూ స్థానిక రైతులు గత కొన్ని నెలలుగా చేసిన ఫిర్యాదుల ఆధారంగా అధికారులు డిసెంబర్ 2025 నుండి మే 2026 మధ్య కాలంలో ఐదుసార్లు ఫ్యాక్టరీని తనిఖీ చేశారు. ఈ ఫ్యాక్టరీతో వ్యవసాయ భూముల్లోని బావుల్లో భూగర్భ జలాలు కలుషితమ య్యాయని కాలుష్య మండలి నిర్ధారించింది.

## 'హెల్తీ' పేర్లపై ఎఫ్ఎస్ఎస్ఏఐ కొరడా.. ఆ 8 బ్రాండ్లకు నోటీసులు

ఇంటర్నెట్ డెస్క్:

నెస్లే ఇండియా సంస్థకు చెందిన మ్యాగీ న్యూడుల్స్‌లో పురుగులు ఉన్నాయంటూ ఇటీవల విమర్శలు వెల్లువెత్తిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో భారత ఆహార భద్రతా ప్రమాణాల సంస్థఅప్రమత్తమై నెస్లేను వివరణ కోరడం సహా.. ఆహార ఉత్పత్తులపై వినియోగదారులను తప్పుదారి పట్టించేలా ఉన్న వాణిజ్య, బ్రాండ్ పేర్లు, ఆరోగ్య సంబంధిత ప్రకటనలపైచర్యలకు ఉపక్రమించింది. ఈ క్రమంలో తాజాగా 8 ఆహార, వ్యాపార సంస్థలకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్టు ఎక్స్ మీడియా వేదికగా వెల్లడించింది.ఎమామి హెల్తీ అండ్ టేస్టీ, హెల్త్ ఎయిడ్, ట్రూవీ, ది హెల్తీ ఫ్యాక్టరీ, హెల్తీ మాస్టర్, హెల్తీ ఛాయిస్, ప్లాన్ బీ, న్యూహెర్బ్స్‌లకు సదరు నోటీసులు పంపినట్టు ఎఫ్ఎస్ఎస్ఏఐ పేర్కొంది. ఎమామీ హెల్తీ, ట్రూ విటమిన్, వీగన్ వంటి పేర్లతో వినియోగదారుల్లో ఉత్పత్తులపై ప్రత్యేక ఆరోగ్య ప్రయోజనాల భావన కలిగిస్తున్నారనే ఆరోపణలతో ఈ చర్యలకు ఉపక్రమించినట్టు స్పష్టం చేసింది. సదరు సంస్థలు ఆహార భద్రతా ప్రమాణాల చట్టం-2006 నిబంధనలను ఉల్లంఘించినట్లు ప్రాథమికంగా గుర్తించామని తెలిపింది. ఇటీవల మార్కెట్లోకి వచ్చిన పలు ఆహార ఉత్పత్తులు, బ్రాండ్లు, ప్రచార వాదనలపై ఎఫ్ఎస్ఎస్ఏఐ అభ్యంతరాలు వ్యక్తం చేసింది. ఎమామి గ్రూప్‌నకు చెందిన హెల్తీ అండ్ టేస్టీ వంట నూనెల బ్రాండ్ పేరు, ప్లాన్ బీ సంస్థ వీగన్ అనుమతులు లేకుండానే చేస్తున్న ప్రచారం, ది హెల్తీ ఫ్యాక్టరీ జీరో మైదా ఉత్పత్తుల వాదనలు, న్యూ హెర్బ్స్ విక్రయిస్తున్న ట్రూ విటమిన్‌లపై అనుమానాలు లేవనెత్తింది. అలాగే ట్రూవీ, హెల్తీ మాస్టర్, హెల్తీ ఛాయిస్, హెల్త్ ఎయిడ్ వంటి సంస్థలు ఉపయోగిస్తున్న హెల్తీ పేరుతో కూడిన బ్రాండ్ పేర్లు, ట్యాగ్‌లైన్లు వినియోగదారులను తప్పుదారి పట్టించే అవకాశముందని పేర్కొంది. ఈ పేర్లు, వాదనలు, ప్రచార విధానాలు నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయనే అంశంపై పరిశీలిస్తున్నట్టు స్పష్టం చేసింది. కాగా.. ఇటీవలే సోషల్ మీడియాలో వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా నెస్లే ఇండియా(మ్యాగీ), కేఎఫ్‌సీ, ఫ్లిప్‌కార్ట్, ఓపెన్ సీక్రెట్ సంస్థలకూ ఎఫ్ఎస్ఎస్ఏఐ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. వినియోగదారులకు సరైన సమాచారం అందేలా చూడటం, తప్పుడు లేదా బూటకపు ఆరోగ్య వాదనలను అరికట్టడం తమ ప్రధాన లక్ష్యమని ఎఫ్ఎస్ఎస్ఏఐ స్పష్టం చేసింది.




## మరింత ఎక్కువగా రష్యా చమురు.. మేలో గణనీయంగా పెరిగిన దిగుమతులు

రష్యా నుంచి భారత్‌కు ముడి చమురు దిగుమతులు మే నెలలో గణనీయంగా పెరిగాయి. మే నెలలో రష్యా నుంచి మొత్తంగా 5.8 బిలియన్ యూరోల విలువైన చమురు, బొగ్గును భారత్ కొనుగోలు చేసినట్టు ఐరోపాకు చెందిన సెంటర్ ఫర్ రీసెర్చ్ ఎనర్జీ అండ్ క్లీన్ నివేదిక వెల్లడించింది. మే నెలలో రష్యా నుంచి అత్యధిక చమురును కొనుగోలు చేసిన రెండో దేశంగా భారత్ నిలిచింది ఏప్రిల్ నెలతో పోల్చితే మే నెలలో రష్యా నుంచి ముడి చమురు దిగుమతులు 21 శాతం మేర పెరిగాయి. వడినార్ రిఫైనరీ కొనుగోళ్లు 36 శాతం, జామ్‌నగర్ రిఫైనరీ కొనుగోళ్లు 14 శాతం వృద్ధి చెందాయి. ఇక, ప్రభుత్వ రంగ చమురు కర్మాగారాలు కూడా రష్యా ముడిచమురు దిగుమతులను గణనీయంగా పెంచాయి. గతేడాది నవంబర్ నుంచి రష్యా చమురు దిగుమతులను నిలిపివేసిన న్యూ మంగుళూరు, విశాఖపట్నం రిఫైనరీలు ఈ ఏడాది మార్చి నుంచి తిరిగి మొదలుపెట్టాయి. మే నెలలో భారీగా పెంచాయి. ఇక, రష్యా నుంచి చమురు కొనుగోళ్లు చేస్తున్న భారత్, తుర్కియే, బ్రూనై, జార్జియా.. ఇతర దేశాలకు 641 మిలియన్ యూరోల విలువైన చమురును ఎగుమతి చేశాయి. ఐరోపా, ఆస్ట్రేలియా, అమెరికా, న్యూజిలాండ్ దేశాలు ఈ చమురును దిగుమతి చేసుకున్నాయి. రిలయన్స్‌కు చెందిన జామ్‌నగర్ రిఫైనరీ నుంచి అమెరికాకు ముడి చమురు ఎగుమతి జరిగింది.




# స్పోర్ట్స్

## నా సెంచరీ క్రెడిట్ గంభీర్‌కే దక్కుతుంది: గుర్బాజ్



ఇంటర్నెట్ డెస్క్:

భారత్‌తో ధర్మశాలలో జరిగిన తొలి వన్డేలో అఫ్గానిస్థాన్ జట్టు ఓడిన సంగతి తెలిసిందే. వర్షం కారణంగా 25 ఓవర్లకు కుదించిన ఈ మ్యాచ్‌లో.. అఫ్గాన్ ఓపెనర్ రహ్మనుల్లా గుర్బాజ్ అద్భుతమైన సెంచరీతో అదరగొట్టాడు. ఓ వైపు వికెట్లు పడుతున్నా.. 51 బంతుల్లో 102 పరుగులు చేశాడు. అయితే తన ఇన్నింగ్స్‌పై గుర్బాజ్ తాజాగా స్పందించాడు. ఆ ఆటపై టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ సూచనలు ప్రభావం చూపాయని వెల్లడించాడు.ఇలాంటి అద్భుత ఇన్నింగ్స్ ఆడినందుకు ఆనందంగా ఉంది. వ్యక్తిగతంగా నా ఆటతీరు చాలా మెరుగైంది. అందుకోసం నెట్స్‌లో తీవ్రంగా శ్రమించా. అయితే ఈ ఇన్నింగ్స్‌కు క్రెడిట్ మాత్రం గంభీర్‌కే దక్కుతుంది. టెస్టు మ్యాచ్ ముగిసిన తర్వాత ఆయనతో చాలాసేపు మాట్లాడా. అది నా ఆటతీరును మెరుగుపర్చుకోవడంలో చాలా సాయం చేసింది. షాట్ల ఎంపికపై ఆయన నాకు విలువైన సూచనలు చేశారు. నెట్స్‌లో అదే ప్రాక్టీస్ చేశా. ఇప్పుడు ఫలితం వచ్చింది. అందుకే గంభీర్ సర్‌కు కృతజ్ఞతలు చెబుతున్నా. పిచ్ చాలా క్లిష్టంగా ఉంది. స్పిన్‌ను ఆడటం అంత తేలికైన విషయం కాదు. స్పిన్నర్లకు కాస్త టర్న్‌తోపాటు సహకారం లభించింది. నేను మాత్రం పాజిటివ్‌గా ఆడా. కానీ జట్టు ఓడిపోవడంతో చాలా నిరాశకు గురయ్యా' అని గుర్బాజ్ తెలిపాడు.




## మరికొన్ని గంటల్లో భారత్‌తో మ్యాచ్‌కు.. పాకిస్థాన్‌కు బిగ్ షాక్

స్పోర్ట్స్ డెస్క్:

మహిళా టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా హైవోల్టేజ్ మ్యాచ్‌కు రంగం సిద్ధమైంది. ఎడ్జ్‌బాస్టన్ వేదికగా గ్రూపు-ఎ మ్యాచ్‌లో భాగంగా దాయాదీ దేశాలైన భారత్, పాకిస్థాన్ జట్లు తలపడనున్నాయి. రాత్రి 7:00 మ్యాచ్ ప్రారంభం కానుంది. ఈ క్రమంలోనే పాక్ జట్టుకు బిగ్ షాక్ తగిలింది. నిన్న(శనివారం) ఆ జట్టు కెప్టెన్ ఫాతిమా సనా గాయపడింది.ప్రాక్టీస్ సెషన్‌లో భాగంగా బౌలింగ్ ప్రాక్టీస్ చేస్తుండగా, యువ బ్యాటర్ ఆయేషా జాఫర్ కొట్టిన షాట్ నేరుగా ఫాతిమా సనా కుడి మోకాలికి తగిలింది. దీంతో ఆమె తీవ్రమైన నొప్పితో నేలపై పడి విలవిల్లాడింది. వెంటనే ఫిజియో వచ్చి సనాకు చికిత్స అందించాడు. కాసేపటి తర్వాత ప్రాక్టిస్ చేయకుండానే ఆమె నెట్స్ నుంచి వెళ్లిపోయింది. ఫాతిమా తిరిగి ప్రాక్టీస్‌కు రాలేదు. కానీ దాదాపు గంట తర్వాత ఫాతిమా అటు ఇటు నడుస్తూ గ్రౌండ్‌లో కనిపించింది. ప్రీ మ్యాచ్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఫాతిమా సనాకు తన గాయం గురించి విలేకరులు ప్రశ్నించారు. అది అనుకోకుండా జరిగిన సంఘటన మాత్రమేని, తన సహచర ప్లేయర్ ఆయేషా ఆడిన షాట్ మోకాలికి తగిలిందని తెలిపింది. కొంచెం నొప్పి తగ్గిందని, మ్యాచ్ ప్రారంభమయ్యే సరికి పూర్తిగా కోలుకుంటానని ఆశిస్తున్నానట్లు ఫాతిమా పేర్కొంది. ఒకవేళ భారత్‌తో మ్యాచ్‌కు ఫాతిమా దూరమైతే... ఆమె స్థానంలో వికెట్ కీపర్ మునీబా అలీ జట్టును నడిపించే అవకాశం ఉందని క్రికెట్ నిపుణులు అభిప్రాయ పడుతున్నారు.




## ఆర్చరీ ప్రపంచ కప్: భారత్‌కు స్వర్ణం




ఇంటర్నెట్ డెస్క్:

ఆర్చరీ ప్రపంచ కప్‌లో భారత్ చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేసింది. తుర్కియేలో జరిగిన ఆర్చరీ ప్రపంచ కప్ స్టేజ్ 3 పోటీలో భారత్ స్వర్ణం గెలుచుకుంది. రికర్వ్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో భారత్‌కు చెందిన ధీరజ్ బొమ్మదేవర, కుంకుమ్ మొహోద్.. ప్రస్తుత ఒలింపిక్ ఛాంపియన్ అయిన దక్షిణ కొరియాను వరుస సెట్లలో ఓడించారు. దక్షిణ కొరియాకు చెందిన ఓహ్ యే-జిన్, కిమ్ జె-డివోక్‌పై 5-1 తేడాతో విజయం సాధించారు. నాలుగేళ్ల తర్వాత భారత్ వరల్డ్ కప్ స్టేజ్‌లో ఈ విభాగంలో బంగారు పతకం సాధించింది. చివరిసారిగా 2022 ఈవెంట్‌లో రిధి ఫోర్ - తరుణ్‌దీప్ రాయ్ జోడీ గోల్డ్‌ను గెలుచుకుంది. తొలి సెట్ నుంచే ఆధిక్యం సాధించిన భారత జోడీ.. కీలక సమయాల్లో ఒత్తిడిని అధిగమిస్తూ అద్భుత ప్రదర్శన కనబరిచింది. ముఖ్యంగా చివరి దశలో ధీరజ్ వరుసగా రెండు పర్ఫెక్ట్ 10లు కొట్టడంతో మ్యాచ్ మలుపు తిరిగింది. అతడి గురి దక్షిణ కొరియాకు అవకాశమే ఇవ్వకుండా భారత్‌కు స్వర్ణ పతకాన్ని ఖాయం చేసింది. తొలి రెండు రౌండ్లలో 37-36, 37-36తో భారత్‌దే ఆధిపత్యం. ఇక మూడో రౌండ్‌లోనూ పోటాపోటీగా జరిగినా.. 39-39తో ఇరు జట్లూ సమంగా నిలిచాయి. దీంతో భారత్ విజేతగా అవతరించింది. ధీరజ్, కుంకుమ్‌లకు మిక్స్‌డ్ టీమ్ విభాగంలో ఇది తొలి ప్రపంచకప్ స్వర్ణ పతకం కావడం విశేషం. ప్రస్తుతం భారత అగ్రశ్రేణి ఆర్చర్‌గా కొనసాగుతున్న ధీరజ్ వ్యక్తిగత విభాగంలోనూ పతక పోటీలో నిలిచాడు. మరోవైపు 17 ఏళ్ల కుంకుమ్ మొహోద్ అంతర్జాతీయ వేదికపై తన ప్రతిభను మరోసారి నిరూపించుకుంది. ఈ ఏడాది షాంఘై ప్రపంచకప్ స్టేజ్-2లో భారత మహిళల రికర్వ్ జట్టుతో కలిసి ఆమె ఇప్పటికే స్వర్ణ పతకం గెలిచింది.

# భారీ అంచనాలతో జులై 3న ‘నాగబంధం: ది సీక్రెట్ ట్రెజర్’

**-జులై 3న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల**

**-అభిషేక్ నామా దర్శకత్వంలో మైథలాజికల్ ఫాంటసీ థ్రిల్లర్**

**-నభా నటేష్, ఐశ్వర్య మీనన్ హీరోయిన్లుగా నటన**

**-భారీ తారాగణంతో సినిమాపై పెరుగుతున్న ఆసక్తి**

యువ నటుడు విరాట్ కర్ణ హీరోగా, అభిషేక్ నామా దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ చిత్రం ‘నాగబంధం: ది సీక్రెట్ ట్రెజర్’. మైథలాజికల్ ఫాంటసీ అడ్వెంచర్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ సినిమాను జులై 3న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఈ చిత్రంలో నభా నటేష్, ఐశ్వర్య మీనన్ కథానాయికలుగా నటిస్తున్నారు. గతంలో విడుదలైన ఈ సినిమా టీజర్‌కు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన లభించింది. విజువల్స్, కాన్సెప్ట్ పరంగా సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. రహస్య నిధి అన్వేషణ, పురాణ గాథల నేపథ్యంతో కూడిన కథాంశంతో ఈ చిత్రం ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందిస్తుందని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది. తాజాగా ‘స్వామి వారి రథయాత్ర’ పేరుతో చేపట్టిన ప్రచార కార్యక్రమం సినిమాపై మరింత ఆసక్తిని పెంచింది. అభిషేక్ పిక్చర్స్, ఎన్ఐకే స్టూడియోస్ బ్యానర్లపై తెరకెక్కుతున్న ఈ చిత్రంలో జగపతి బాబు, మహేష్ మంజ్రేకర్, మురళీ శర్మ, దక్షా నగార్కర్, రిషభ్ సాహ్నీ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. భారీ తారాగణం, ఉన్నత సాంకేతిక విలువలతో వస్తున్న ‘నాగబంధం’ చిత్రం జులై 3న థియేటర్లలో ప్రేక్షకులను ఏ మేరకు ఆకట్టుకుంటుందో వేచి చూడాలి.




## ఈటీవీ విన్‌లో మనసును హత్తుకునే ‘ఇల్లు’.. స్ట్రీమింగ్ ప్రారంభం



ప్రముఖ తెలుగు ఓటీటీ వేదిక ‘ఈటీవీ విన్’, ‘కథా సుధ’ పేరుతో అందిస్తున్న లఘు చిత్రాల సిరీస్‌లో భాగంగా ఈ ఆదివారం (జూన్ 14) ‘ఇల్లు’ అనే కొత్త షార్ట్ ఫిలింను విడుదల చేసింది. ప్రతి వారం ఒక వైవిధ్యభరితమైన కథను ప్రేక్షకులకు అందించే ఈ కార్యక్రమంలో భాగంగా, ఈ చిత్రం నేటి నుంచి స్ట్రీమింగ్ అవుతోంది. ఈ లఘు చిత్రంలో హర్షవర్ధన్, బిందు చంద్రమౌళి, అనీష్ కురివిల్లా, పవన్ రమేష్ కీలక పాత్రలు పోషించారు. రోహిత్ పెనుమత్స (రాహుల్ రవీంద్రన్) దర్శకత్వం వహించగా, మనోహరి ఆర్ట్స్ బ్యానర్‌పై కిషోర్ మరిశెట్టి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఏళ్ల తరబడి అద్దెకు ఉంటున్న ఇంటిని ఖాళీ చేయాలని యజమాని కోరినప్పుడు, ఒక రచయిత ఎదుర్కొనే మానసిక సంఘర్షణే ఈ చిత్ర ప్రధాన ఇతివృత్తం. ఇల్లు అంటే కేవలం నాలుగు గోడలు మాత్రమే కాదని, మనిషికి ఆ ఇంటితో ఉండే అనుబంధాన్ని, జ్ఞాపకాలను ఈ చిత్రం ఎంతో భావోద్వేగభరితంగా ఆవిష్కరిస్తుంది.

## సుకుమారిని టచ్ చేస్తే షాక్.. ‘ఓ సుకుమారి!’ ఫన్నీ టీజర్ వచ్చేసింది!



విలక్షణ నటుడు తిరువీర్, స్టార్ హీరోయిన్ ఐశ్వర్య రాజేశ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న కొత్త చిత్రం ‘ఓ సుకుమారి!’. భరత్ దర్శన్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా నుంచి తాజాగా వినోదభరితమైన టీజర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ప్రస్తుతం ఈ టీజర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటూ సినిమాపై అంచనాలను పెంచుతోంది. టీజర్‌ను గమనిస్తే.. తనకు సుకుమారంగా, సున్నితంగా ఉండే అమ్మాయి భార్యగా కావాలని హీరో (తిరువీర్) తన కుటుంబసభ్యులను కోరతాడు. “చూడగానే ఒళ్లు జలదరించాలి” అంటూ తనకు కాబోయే భార్య ఎలా ఉండాలో వివరిస్తాడు. అతని అంచనాలకు తగ్గట్టే ఓ అమ్మాయిని (ఐశ్వర్య రాజేశ్) చూసి పెళ్లి ఫిక్స్ చేస్తారు. అయితే, పెళ్లి పీటల మీద అనుకోకుండా పెళ్లికూతురి భుజం తగలగానే పెళ్లికొడుకుకు తేలికపాటి ఎలక్ట్రిక్ షాక్ తగులుతుంది. ఈ వినూత్నమైన కాన్సెప్ట్‌తో టీజర్‌ను కట్ చేసి సినిమాపై ఆసక్తిని రేకెత్తించారు. ‘మసూద’, ‘ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో’ వంటి చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న తిరువీర్ ఈ సినిమాలో హీరోగా నటిస్తుండగా, గతేడాది ‘సంక్రాంతికి వస్తున్నాం’ బ్లాక్‌బస్టర్‌తో మెప్పించిన ఐశ్వర్య రాజేశ్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ చిత్రంతో భరత్ దర్శన్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు.

# ఇచ్చిన మాట నిలబెట్టుకున్న విజయ్-రష్మిక విద్యార్థులకు అండగా కొత్త దంపతులు



స్టార్ దంపతులు విజయ్ దేవరకొండ, రష్మిక మందణ్ణ ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. తాము ప్రకటించినట్టుగానే సేవా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. విజయ్ తండ్రి జన్మించిన తెలంగాణలోని అచ్చంపేట మండలంలోని 9, 10వ తరగతి విద్యార్థులకు అండగా నిలుస్తున్నట్లు ప్రకటించారు. ఈ విషయాన్ని విజయ్ దేవరకొండ స్వయంగా సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. ఈ మేరకు విజయ్ తన ‘ఎక్స్’ (ట్విట్టర్) ఖాతాలో ఓ పోస్ట్ పెట్టారు. “మా నాన్న పుట్టిన చిన్న పల్లె తుమ్మనపేటకు బయలుదేరాం. ఈ ఏడాది ఫిబ్రవరిలో నేను, రష్మిక మా ఒక చిన్న కలను ప్రకటించాం. అచ్చంపేట మండలంలోని 9, 10 తరగతుల విద్యార్థులను ప్రోత్సహించాలన్నదే మా లక్ష్యం” అని పేర్కొన్నారు. విజయ్ పోస్ట్‌ను రష్మిక రీషేర్ చేస్తూ తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఉదయ్‌పూర్‌లో వివాహ బంధంతో ఒక్కటైన ఈ జంట, ‘దేవరకొండ ఫౌండేషన్’ ద్వారా తుమ్మనపేటలోని 44 ప్రభుత్వ పాఠశాలల్లో 9, 10వ తరగతి చదివే విద్యార్థులకు విద్యా సహాయం అందిస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల ఫీజులు చెల్లించడం, వారికి అవసరమైన నోట్‌బుక్స్, ఇతర స్టడీ మెటీరియల్‌ను అందించనున్నారు. తద్వారా తల్లిదండ్రులపై ఆర్థిక భారం తగ్గించడంతో పాటు ఆర్థిక కారణాలతో చదువు మధ్యలో ఆగిపోకుండా చూడాలన్నది వీరి సంకల్పం. ఇక సినిమాల విషయానికొస్తే, వివాహం తర్వాత విజయ్, రష్మిక తొలిసారిగా ‘రణబాలి’ అనే పీరియడ్ డ్రామా చిత్రంలో కలిసి నటిస్తున్నారు. గతంలో ‘గీత గోవిందం’, ‘డియర్ కామ్రేడ్’ వంటి విజయవంతమైన చిత్రాల్లో నటించిన ఈ జంటకు, ‘రణబాలి’ మూడో చిత్రం కానుంది. 1850ల నాటి చారిత్రక వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తోంది. చరిత్ర పుస్తకాల్లో నమోదుకాని, బ్రిటిష్ వారు తప్పుగా ప్రచారం చేసిన కొన్ని కీలక సంఘటనల ఆధారంగా ఈ చిత్రం కథ సాగుతుందని సమాచారం.

# అఖిల్ ‘లెనిన్’ విడుదల వాయిదా.. కొత్త తేదీని ప్రకటించిన నాగార్జున

అక్కినేని అఖిల్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం ‘లెనిన్’ విడుదల వాయిదా పడింది. ఈ విషయాన్ని ఆయన తండ్రి, ప్రముఖ నటుడు కింగ్ నాగార్జున అధికారికంగా ప్రకటించారు. సినిమాను జూలై 10న విడుదల చేయనున్నట్లు ఆయన తన సోషల్ మీడియా ఖాతా ద్వారా వెల్లడించారు. ఈ వాయిదాకు గల కారణాన్ని నాగార్జున స్పష్టంగా వివరించారు. “లెనిన్ చిత్రబృందం నన్ను కలిసి, సినిమాను మరింత ప్రత్యేకంగా, 100 శాతం అత్యుత్తమంగా తీర్చిదిద్దేందుకు మరికొంత సమయం కావాలని కోరారు. వారిలోని అభిరుచి, స్ఫూర్తి చూసి నేను అంగీకరించాను” అని ఆయన తన పోస్ట్‌లో పేర్కొన్నారు. అంతేకాకుండా, సినిమాపై అంచనాలు పెంచేలా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. “మనోడు జూలై 10న వస్తున్నాడు. నేను మళ్ళీ చెబుతున్నా, మీరు ఒక కొత్త అఖిల్‌ను చూస్తారు! ‘లెనిన్’ అనుభవానికి సిద్ధంగా ఉండండి” అంటూ అభిమానుల్లో ఉత్సాహం నింపారు. నాగార్జున ప్రకటనతో సినిమా విడుదల తేదీ పై నెలకొన్న ఊహాగానాలకు తెరపడింది. నాణ్యమైన చిత్రాన్ని అందించాలనే లక్ష్యంతోనే చిత్రబృందం ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టమవుతోంది.






Publisher: AKULA SWATHI , printed at SUNDAY PRINTING PRESS, FLAT. NO.363B,1st FLOOR,MADHAVARAM NAGAR COLONY ,RANGAREDDY, TELANGANA - 500072 .
Published at H.NO.15-56/1, Village & Mandal CHERIAL , SIDDIPET District ,Telangana state - 506223, Editor :THADEM PRASHANTH Cell :9000306455